


# మానవునికి కంటిచూపే ప్రధానం!

- ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం
- ప్రారంభించిన బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి
- కంటిచూపు బాగుంటేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం
- గుండెనెమ్మి స్కూల్ లో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ



**జుక్కల్, మార్చి 6 (జనం పవర్):**

మానవునికి అన్నిటికన్నా ప్రధానమైనది కంటి చూపు అని బాన్సువాడ డీఎస్పీ విట్టల్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపల్ పరిధిలో ఆటో డ్రైవర్ల కోసం 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డీఎస్పీ విట్టల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు బాగుంటేనే ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించవచ్చని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ప్రధాన ఉద్దేశంతోనే ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఈ కంటి చూపు పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. డ్రైవర్లు విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇదే క్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుండెనెమ్మి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బిచ్కుంద సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, సబ్ ఇన్స్పెక్టర్ రాజు, లయన్స్ క్లబ్ రీజినల్ అధ్యక్షుడు డాక్టర్ ఓం ప్రకాష్, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోపాల్, కోశాధికారి పోకల్ ప్రభాకర్, డాక్టర్ రాజు, స్థానిక ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.







# అంబిటస్ స్కూల్‌లో ఘనంగా 'కింగ్డమ్ ఆఫ్ లాంగ్వేజ్'

- విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమం
- అమెరికన్ యాక్సెంట్‌తో అదరగొట్టిన ఒకటి, రెండు, మూడో తరగతుల చిన్నారులు
- ముఖ్య అతిథులుగా హాజరైన టూ టౌన్, రూరల్ సి.ఐలు ఉపేందర్, శ్రీనివాస్
- పిల్లల ముందు సెల్ ఫోన్ల వినియోగం తగ్గించాలని సూచించిన సి.ఐ ఉపేందర్
- కమ్యూనికేషన్ నైపుణ్యాల కోసమే ఈ కార్యక్రమాలన్న కరస్పాండెంట్ శ్రీనివాస్

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

అంబిటస్ స్కూల్ ఆధ్వర్యంలో 'లెక్సుఐకాని (నిఘంటువు) ఉ ది స్కూల్ ఫర్ నెక్స్ట్ జనరేషన్: కింగ్డమ్ ఆఫ్ లాంగ్వేజ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రెండు గంటలకు పైగా ఉత్సాహంగా కొనసాగింది.

## అదరగొట్టిన చిన్నారులు

ఈ కార్యక్రమంలో 1వ, 2వ, 3వ తరగతుల విద్యార్థులు పాల్గొని తమ అద్భుత ప్రతిభను చాటారు. చిన్నారులు అమెరికన్ యాక్సెంట్‌తో ఇంగ్లిష్ మాట్లాడటం, సంభాషణలు చేయడం, కథలు చెప్పడం ద్వారా తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నారు. అలాగే పాటలు, ఆటలు, చిన్న నాటికలు ప్రదర్శిస్తూ ఆహూతులందరినీ అలరించారు.

## పిల్లల ముందు సెల్ ఫోన్లు వాడొద్దు

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టూ టౌన్ సి.ఐ ఉపేందర్, రూరల్ సి.ఐ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఐ ఉపేందర్ మాట్లాడుతూ.. చిన్నారులు చిన్న వయసులోనే ఇంగ్లిష్ భాషలో నైపుణ్యం సంపాదించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. సెల్ ఫోన్ల అధిక వినియోగం వల్ల పిల్లలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ముందు సెల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు చదువులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. రాబోయేది పరీక్షల కాలమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని రూరల్ సి.ఐ శ్రీనివాస్ సూచించారు.

## నైపుణ్యాల పెంపునకే ప్రాధాన్యం

స్కూల్ చైర్మన్, కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. చిన్నారులు ఏమాత్రం బెదురు లేకుండా ధైర్యంగా స్టేజ్‌పై మాట్లాడటం చూసి తల్లిదండ్రులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అక్కడున్న విద్యార్థులు ముక్తకంఠంతో అభినందనలు తెలిపారు.







# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్ పీ వీ టీకా!

- సిద్దిపేటలో అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ హైమావతి
- 14 ఏళ్ల బాలికలకు మార్చి 8 నుంచి ఉచిత వ్యాక్సినేషన్
- రుతుస్రావం సమయంలోనూ టీకా పూర్తిగా సురక్షితం
- మార్చి 31 వరకు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో..
- సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు కలెక్టర్ పిలుపు




**సిద్దిపేట, మార్చి 6 (జనం పవర్ ప్రతినిధి):**

సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ పీ వీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్ పీ వీ వ్యాక్సినేషన్ కు సంబంధించిన అవగాహన పోస్టర్ ను జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో లాంఛనంగా ఆవిష్కరించారు.

## 14 ఏళ్ల బాలికలకు ఉచితం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్ పీ వీ టీకా ఎంతో ముఖ్యమని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల మార్చి 8వ తేదీ నుంచి 14 సంవత్సరాల బాలికలకు హెచ్ పీ వీ టీకాను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని ఆమె సూచించారు. మార్చి 31వ తేదీ వరకు ఈ టీకా అందుబాటులో ఉంటుందని, 14 సంవత్సరాల బాలికల తల్లిదండ్రులు సమీప టీకా కేంద్రాలకు తీసుకెళ్లి టీకా వేయించాలన్నారు.

## ఆసుపత్రుల వివరాలు ఇవే..

జిల్లాలోని జిల్లా ఆసుపత్రి గజ్వేల్, జీజీహెచ్ సిద్దిపేట, ఏరియా ఆసుపత్రి దుబ్బాక, సీహెచ్ సీ నంగునూరు, చేర్యాల, హుస్నాబాద్ ఆసుపత్రుల్లో 14 సంవత్సరాల బాలికలకు ఈ టీకాను ఉచితంగా అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ టీకా ద్వారా గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని, రుతుస్రావం జరుగుతున్న సమయంలో కూడా ఎలాంటి అపోహలు లేకుండా టీకా తీసుకోవచ్చని పేర్కొన్నారు. టీకా పూర్తిగా సురక్షితమని, ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని వారు స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ధనరాజ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దీప్తి, బీఎంహెచ్ ఓలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ విద్యార్థులకు తీరిన రవాణా కష్టాలు!

- మంచిర్యాల మెడికల్ కాలేజీకి మూడు బస్సులు
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ
- ఎంపీ నిధుల నుంచి రూ. 80 లక్షల మంజూరు
- బస్సులను ప్రారంభించిన ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్
- విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని విద్యార్థులకు ఎంపీ సందేశం



**తుడుం జితేందర్ -జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల రవాణా కష్టాలు ఎట్టకేలకు తీరాయి. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తన ఎంపీ నిధుల నుంచి రూ. 80 లక్షలు మంజూరు చేసి కళాశాలకు మూడు బస్సులను అందజేశారు. ఈ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు.

## విద్యార్థుల విన్నపంతో తక్షణ స్పందన

గతంలో మెడికల్ కాలేజీ సందర్శన సమయంలో, హాస్టల్ కు వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను విద్యార్థులు ఎంపీ వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమస్యపై వెంటనే స్పందించిన ఆయన, రూ. 80 లక్షల నిధులు కేటాయించి మూడు బస్సులను ఏర్పాటు చేయాలని అప్పుడే జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అన్న మాట ప్రకారం నిధులు మంజూరు చేసి బస్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు.

## కష్టపడి చదివి పేరు తేవాలి

బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల విన్నపం మేరకు వారి రవాణా సమస్య పరిష్కారానికి ఈ బస్సులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ మెరుగైన సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్య మన హక్కు అని, విద్యతోనే మన భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వివిధ శాఖల అధికారులు, మెడికల్ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# సలాం శ్రమజీవి!

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రమజీవులకు వందనం**

**ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా కుటుంబ పోషణ**

**నిప్పుల కొలిమిల మధ్య, రోడ్ల పక్కన చెమటోడుస్తున్న వైనం**

**కూలి పనులు, బండ్ల వ్యాపారాలతో సమాజానికి ఆదర్శం**

**వారి సేవలను గుర్తించి గౌరవించాలంటున్న స్థానికులు**

**సిద్దిపేట, మార్చి 6 (జనం పవర్ ప్రతినిధి):**

మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో మహిళల పాత్రను గుర్తుచేస్తూ సిద్దిపేట పట్టణ పరిధిలో కుటుంబాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మహిళల జీవన పోరాటం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తోంది. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఈ మహిళలు కుటుంబ పోషణ కోసం ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్నారు. ఇంటి బాధ్యతలు, సమాజంలో తమ పాత్రను ఏకకాలంలో సమానంగా నిర్వహిస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలుస్తున్నారు.



### చెమటోడుస్తున్న శ్రమజీవులు

సలసల మండే ఎండలోనూ, నిప్పుల కొలిమిల మధ్య చెమటోడుస్తూ జీవనం సాగిస్తున్న ఈ మహిళలు నిజమైన శ్రమజీవులుగా నిలుస్తున్నారు. రోజువారీ కూలి పనులు చేస్తూ అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. కొందరు మహిళలు వేడెక్కిన నూనె సెగను భరిస్తూ రోడ్ల పక్కన మిర్చి బండ్లు నడుపుతూ జీవనం సాగిస్తుండగా.. ఇతర రంగాల్లో, పెట్రోల్ బంకుల్లో పని చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.



### అలుపెరగని పోరాటం

ఎర్రటి ఎండలోనూ వెనుకడుగు వేయకుండా తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ కుటుంబ గౌరవాన్ని కాపాడుతున్నారు. జీవనాధారం కోసం నిరంతరం శ్రమిస్తూ తమ ధైర్యం, కృషితో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఈ మహిళల కష్టజీవితాన్ని ప్రతిబింబించే దృశ్యాలు నిత్యం స్థానికంగా కనిపిస్తూనే ఉంటాయి. మహిళా దినోత్సవం సందర్భంగా ఇలాంటి శ్రమజీవి మహిళల సేవలను సమాజం గుర్తించి గౌరవించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





# కుల్పగూర్‌లో అక్రమ నిర్మాణాల ఇష్టరాజ్యం!

- అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమంటున్న గ్రామస్తులు
- ప్రధాన రహదారి పక్కనే దర్జాగా కట్టడాలు
- కోర్టులో కేసు ఉన్నా రాత్రికి రాత్రే పిల్లర్లు
- అడ్డుకోబోయిన వారిపై రౌడీలతో బెదిరింపులు
- హెచ్ఎండీఏ పరిధిలో కబ్జాల పర్వం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు



**సంగారెడ్డి, మార్చి 7 (జనం పవర్):**

సంగారెడ్డి మండలం కుల్పగూర్ గ్రామపంచాయతీ అక్రమాలకు అడ్డాగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీ పరిధిలో గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ పరిస్థితి మారకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమార్కులకు అండదండలు

గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి రెండు వైపులా అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే చర్యలు తీసుకుంటున్నామని మాట దాటవేయడమే తప్ప, గట్టి చర్యలు తీసుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. సంగారెడ్డి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామపంచాయతీ నిత్యం వివాదాల్లోనే ఉండటానికి ప్రధాన కారణం అక్కడి అక్రమార్కులకు కొంతమంది అండదండలు అందించడమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భూములను కబ్జా చేస్తూ ఎకరాల కొద్దీ స్థలాలను స్వాధీనం చేసుకుని నివాసాలు నిర్మించుకున్న తర్వాత, ప్రధాన రహదారి పక్కన ఉన్న మిగిలిన స్థలాన్ని కూడా వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రావడం లేదని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### కోర్టులో కేసు ఉన్నా ఆగని నిర్మాణాలు

ఈ విషయంపై స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి మాత్రం.. తనకు ఏమీ తెలియదని, వారికి నోటీసులు ఇచ్చామని, మండల రెవెన్యూ అధికారితో విచారణ జరిపిస్తామని సమాధానం చెప్పినట్టు సమాచారం. అయితే ఇప్పటికే ఈ అంశం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా కూడా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ భూములపై కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, అక్రమార్కులు మాత్రం రాత్రికి రాత్రే పిల్లర్లు లేపి నిర్మాణాలు కొనసాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన వారిని ఏకంగా రౌడీలతో బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి.

### కఠిన చర్యలు తీసుకోవాలి

గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేని కట్టడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వెంచర్లు కూడా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం ఇప్పటికే ఎంపీడీవో, డీఎల్పీవో స్థాయి అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోకపోవడం వారి పనితీరుపై తీవ్ర సందేహాలు కలిగిస్తోంది. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన భవనాలు, వెంచర్లను తక్షణమే కూల్చివేసి ఆ భూములను ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు హెచ్ఎండీఏ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, సంగారెడ్డి పరిసర గ్రామాల్లో మాత్రం అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- 99 రోజుల కార్యాచరణ!
- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- మెదక్ కలెక్టరేట్ లో అధికారులతో సన్నాహక సమీక్ష సమావేశం
- సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశం
- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీపై దిశానిర్దేశం
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు

**ఉమ్మడి మెదక్, మార్చి 6 (జనం పవర్):**

ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనఉప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రజాపాలనఉప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై శుక్రవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సన్నాహక సమీక్ష సమావేశం నిర్వహించారు.

### ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలు, వైద్యరంగంలో తీసుకొస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను మెరుగుపరిచే ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా ప్రజలకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించే అంశాలను కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. స్థలం ఉన్నా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించే ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 99 రోజుల కార్యాచరణలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### సమన్వయంతో పనిచేయాలి

ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని మంత్రి సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి వాటి ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్ల మరమ్మత్తులు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రజాపాలనఉప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 10 థీమ్స్ కార్యక్రమాలను ఆయా శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

### ప్రజాప్రతినిధుల సూచనలు

ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దుబ్బాకలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అండర్ పాస్ నిర్మించాలని కోరారు.

# పోన్కల్ గ్రామపంచాయతీ సంతల వేలంపాట!

**మార్చి 16న వారంతపు, దినసంతల వేలం**

**పోన్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహణ**

**వారసంతకు రూ. 20 వేలు, దిన సంతకు రూ. 10 వేలు డిపాజిట్**

**ఆసక్తిగల వారు పాల్గొనాలని ఈవో రాహుల్ పిలుపు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే వారంతపు, దినసంతల వేలంపాటకు రంగం సిద్ధమైంది. ఈ వేలంపాట నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి (ఈవో) రాహుల్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్తుల సౌకర్యార్థం, పంచాయతీ ఆదాయ వనరులను మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రతి ఏటా నిర్వహించే ఈ సంతల వేలంపాటను ఈసారి అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**వేలం వివరాలు ఇవే..**

ఈ సంతల వేలంపాట తేదీని మార్చి 16, 2026గా నిర్ణయించారు. పోన్కల్ గ్రామపంచాయతీ కార్యాలయం వేదికగా ఈ వేలం జరగనుంది. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణీత మొత్తాన్ని డిపాజిట్ గా చెల్లించాల్సి ఉంటుంది. వారసంత కోసం బరిలో నిలిచేవారు రూ. 20,000, దిన సంత కోసం పోటీ పడేవారు రూ. 10,000 చొప్పున ముందుగా డిపాజిట్ చెల్లించాలి.

**నిబంధనలు, సూచనలు**

ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్ణీత గడువులోగా డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈవో రాహుల్ కోరారు. వేలం పాటలో అత్యధిక ధర పలికిన వారికి నిబంధనల ప్రకారం సంతల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఈ వేలం ప్రక్రియలో స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పోన్కల్ గ్రామపంచాయతీలో సంతల వేలం!

**మార్చి 16న వారంతపు, దినసంతల వేలంపాట**

**పోన్కల్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహణ**

**వారసంతకు 20 వేలు, దిన సంతకు 10 వేల రూపాయల డిపాజిట్**

**ఆసక్తిగల వారు పాల్గొనాలని కార్యదర్శి రాహుల్ పిలుపు**

**తుడుం జితేందర్ -జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే వారంతపు, దినసంతల వేలంపాటకు రంగం సిద్ధమైంది. ఈ వేలంపాట నిర్వహణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి రాహుల్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్తుల సౌకర్యార్థం, పంచాయతీ ఆదాయ వనరులను మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రతి ఏటా నిర్వహించే ఈ సంతల వేలంపాటను ఈసారి అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



**వేలం వివరాలు ఇవే..**

ఈ సంతల వేలంపాట తేదీని మార్చి 16గా నిర్ణయించారు. పోన్కల్ గ్రామపంచాయతీ కార్యాలయం వేదికగా ఈ వేలం జరగనుంది. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణీత మొత్తాన్ని డిపాజిట్ గా చెల్లించాల్సి ఉంటుంది. వారసంత కోసం బరిలో నిలిచేవారు 20 వేల రూపాయలు, దిన సంత కోసం పోటీ పడేవారు 10 వేల రూపాయల చొప్పున ముందుగా డిపాజిట్ చెల్లించాలి.

**నిబంధనలు, సూచనలు**

ఆసక్తి కలిగిన వ్యక్తులు నిర్ణీత గడువులోగా డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి వేలంలో పాల్గొనాలని కార్యదర్శి రాహుల్ కోరారు. వేలం పాటలో అత్యధిక ధర పలికిన వారికి నిబంధనల ప్రకారం సంతల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఈ వేలం ప్రక్రియలో స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రియల్ ఎస్టేట్ రాబందుల కన్ను

- స్మశాన భూమిపై కబ్జా!
- మల్కాపూర్ లో ప్రకాష్ గ్రూప్ రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలు
- రోడ్డు కోసం రెండు ఎకరాల స్మశాన వాటిక ఆక్రమణ
- దారికడ్డంగా కాంపౌండ్ వాల్, గేటు నిర్మాణం
- అడిగితే 'దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ బెదిరింపులు
- ఆర్డీవో, కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మల్కాపూర్ గ్రామస్తులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు



**సంగారెడ్డి, మార్చి 7 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో స్మశాన వాటిక భూమిపై కబ్జా జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. రాజకీయ అండదండలతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కబ్జాదారుల బారి నుంచి స్మశాన వాటికను కాపాడాలని కోరుతూ గ్రామస్తులు ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేశారు.



**రోడ్డు కోసం స్మశాన భూమి కబ్జా**

గ్రామానికి చెందిన సర్వే నంబర్ 101/2లో ఉన్న సుమారు రెండు ఎకరాల స్మశాన వాటిక భూమిని ప్రకాష్ గ్రూప్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసి, తమ వెంచర్ కు రోడ్డు వేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జా కారణంగా గ్రామంలో ఎవరైనా మరణిస్తే కనీసం అంత్యక్రియలు నిర్వహించుకునే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మల్కాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గౌడ, పద్మశాలి కులస్తులు స్మశాన వాటికకు నేరుగా వెళ్లకుండా దారికి అడ్డంగా కాంపౌండ్ వాల్ నిర్మించి గేట్ పెట్టారని తెలిపారు. దీనిపై రియల్ ఎస్టేట్ నిర్వాహకులను ప్రశ్నిస్తే "మీ దిక్కున్న చోట చెప్పుకోండి" అంటూ దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన వాపోయారు.

**అధికారుల మౌనం.. గ్రామస్తుల ఆగ్రహం**

ఈ విషయంపై కొండాపూర్ ఎమ్మార్వో అశోక్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సర్వే నిర్వహించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు కూడా ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇదిలా ఉండగా మల్కాపూర్ గ్రామానికి చెందిన డంపింగ్ యార్డ్ స్థలాన్ని కూడా కబ్జా చేసి, అది కనిపించకుండా గోడ నిర్మించారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా దీనిపై గ్రామపంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వెంటనే సర్వే నిర్వహించాలి**

ప్రభుత్వ భూములపై బహిరంగంగా జరుగుతున్న కబ్జాలను అడ్డుకోవాల్సిన అధికారులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని గ్రామస్తులు అంటున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, స్మశాన వాటిక భూమిని కబ్జా నుండి విడిపించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో కౌన్సిలర్ కొండాపురం జగన్, గౌడ కులస్తులు, ఇతర గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల వేగానికి యాక్షన్ ప్లాన్ కీలకం!

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

- గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత
- ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం
- జిల్లా అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలి: ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి





**సంగారెడ్డి, మార్చి 7 (జనం పవర్):**

క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన యాక్షన్ ప్లాన్ అమలు కీలకమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మెదక్ కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలని అన్నారు. ప్రతి శాఖ అధికారి సమయపాలన పాటిస్తూ, అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో పూర్తి చేయాలని సూచించారు.

**పల్లెల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని నిర్మల జగ్గారెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సమిష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల్లో పారదర్శకత ఉండాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పేద ప్రజలకు అందే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.

**గ్రామాల వారీగా ప్రణాళికలు**

అధికారులు గ్రామాల వారీగా ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి అంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేష్ శెట్కార్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు రోహిత్ రావు, సంజీవ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం ఇవ్వండి!

- కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆఫీసు నిర్మాణానికి వినతి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు వినతిపత్రం అందజేత
- ఏసీ 2.0 జీహెచ్ స్థలం కేటాయించాలని కోరిన నేతలు
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో కలెక్టర్ కు విన్నపం

**జుక్కల్, మార్చి 6 (జనం పవర్):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి అవసరమైన ఏసీ 2.0 జీహెచ్ స్థలం కేటాయించాలంటూ నాయకులు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ విన్నపం చేసినట్లు వారు తెలిపారు.

**కార్యకలాపాలకు ఇబ్బందులు**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయం లేదు. దీంతో పార్టీ సమావేశాలు, కార్యకలాపాలు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మించేందుకు దాదాపు ఏసీ 2.0 జీహెచ్ స్థలం అవసరమని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

**సానుకూలంగా స్పందించాలి**

ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి, పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. స్థలం కేటాయించి భవన నిర్మాణం పూర్తయితే, జిల్లాలో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా, చురుగ్గా నిర్వహించడానికి వీలవుతుందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



